కథానిక

# వృత్తి గౌరవం

కొత్తపల్లి వీరభద్రరావు

ఆమె హోటలులోనికి రావడం నేను చూడనే లేదు. నాకు కాఫీ తెచ్చిపెట్టిన సెర్వరు ముఖంలోని మార్పువల్ల, ఎవరో వచ్చి నా వెనుక కూర్చున్నారని తెలిసింది. నేను వెనక్కి తిరిగి చూడలేదు. ఇంతలోనే వెనకనుండి ఒక స్త్రీ కంఠం, "స్పెషల్ దోసె" అంది. ఇంక వెనక్కి చూడకుండా వుండలేకపోయాను. రాత్రి పదిన్నర. పట్టణం చివర హోటలు. ఎంత చివరంటే! అక్కడ కలరా ఆసుపత్రి వుంది.

ఆమె రాకతో హోటలు సెర్వర్ల ముఖాలు, క్లీనర్ల ముఖాలు మెరిశాయి. వాళ్ల దేహాలకు విద్యుదావేశం కలిగింది. నిరాశ, నిరుత్సాహం, చిరాకు, పరాకు, ఒక్కసారిపోయి ముఖాలన్నీ కలకలలాడ్డం మొదలుపెట్టినవి. కాఫీ వేడిగా వుండడంచేత, ఒక్క గుక్క తాగి నాలుక కాల్చుకుని, కప్పు బల్లమీద పెట్టి కూర్చున్నాను. వెనక్కి చూడకుండా వుండలేకపోయాను. చూశాను. ఇంకా, అలా చూస్తూనే వుండిపోయాను. అలా చూడవచ్చా అనిగాని, ఆమె ఏమనుకొంటుందో అన్న వెరపుగాని కలిగించేదికాదు ఆ సన్నివేశం నాగరిక సంఘానికి సంబంధంలేని, ప్రాథమిక స్త్రీ పురుష సంగతిని తెలియచేసే సన్నివేశం అది.

ఆమెలో, మనం లౌకిక ప్రపంచంలో కలలు కనే అందంలేదు. యౌవనం మాత్రం, ఆరిపోయే దీపంలా ఆ ఒంటిని అంటివుంది. దీపపు క్రీనీడలో ముఖం కనపడలేదు. అక్కడ ముఖానికి ప్రాముఖ్యం లేదని అందరికీ తెలిసినదే. కట్టిన వాయిలు చీర బాగా మాసిపోయి వుంది. చిరుగులు మాత్రం లేవు. జాకెట్టు మాత్రం అంత మాసిలేదు. బాగా దిగువకు ముక్కోణాకారంగా కత్తిరించబడిన మెడ గల పువ్వుల జాకెట్టు. మెడలో ఏమీలేదు. పౌడరు మాత్రం తెలతెల్లగా మెడకింద గీతలలో అంటివుంది. తల చాలా నున్నగా పైకి దువ్వి ముచ్చట ముడివేసింది. తలలో ఒకటి రెండు రంగుల పూలు.

మొగమోటం లేకుండా నేను చూడ్డం చూసి, ఆమె నవ్వి, ముఖం వెలుగులోకి తెచ్చింది. అయ్యరు బిల్లు కాగితం బల్లమీద వెయ్యడం నేను చల్లారిన కాఫీ తాగడం ఒకే సారి. ముఖం సరిగ్గా కనపడలేదు.

నా కెదురుగా బల్లదగ్గిర కూర్చుని డబ్బులు వసూలు చేస్తున్న అయ్యరు కాలిమీద కాలు వేసుకొని కూర్చున్నాడు. క్లీనరు ఒకడు ఎక్కడాలేనంత ఉత్సాహంతో నా ముందు బల్ల తుడవడం మొదలుపెట్టినాడు. నాకు కాఫీ ఇచ్చిన సెర్వరు లోపలికి వెళ్ళి చెప్పినాడు కాబోలు, పిండి రుబ్బుతున్న వాడొకడు ఆ పిండిచేతులతోనే హాలులోకి వచ్చినాడు. నల్లని ఒంటిమీద తెల్లని పిండి చిందులు, మాగాయి బానమీద సున్నంబొట్లు. అందరి ముఖాలమీదా చిరునవ్వే, అందరి దేహాలకీ పులకాంకురాలే. అంతకు పూర్వం హోటల్లో వున్న స్తబ్ధత్వం పటాపంచలం. ఒక్క స్త్రీ ఎంత చేస్తుంది అనుకొన్నా!

లేచి వెళ్ళి అయ్యరుకు డబ్బులిచ్చా. వీధిలోకి వెడుతూ ఆమెవైపు చూశా. ఎందుకు చూశానో తెలియదు. ఆమెకూడా నావైపే చూసి నవ్వుతూ పైట సద్దుకొంది. నా చూపు ఆమెలో కలిగించిన చలనాన్ని చూసి సిగ్గుపడి ఒక్క అంగలో వీధిలో పడ్డాను. మనస్సు వికలం అయింది. ఆమెమీద జాలి వేసింది. మెదడులో ప్రపంచంలోని సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులన్నీ ఒక్కొక్కటే మెరుస్తూ అణగిపోయాయి! ఏనాటికైనా ప్రపంచంలో బ్రతుకుకోసం దేహాన్ని అమ్ముకునే పరిస్థితులు మారతాయా? అనే కల్లోల ఆలోచన.

ఈ ఆలోచనలతో హోటలుకు ఎదురుగా వున్న బస్సు స్టాపుదగ్గిర నిలబడ్డాను పరధ్యానంగా. నా ఎదురుగా ఎవరిదో వెనుకనుండి వచ్చి పొడుగుగా నీడ పడింది. బస్సుకోసం కాబోలు కదంబం పువ్వుల వాసన వేసింది. ఆమె! నేను మాట్లాడకుండా ముఖం తిప్పుకొన్నాను.

"టంకశాలకి పోవాలంటే ఇక్కడే నా నండి నిలవడం" అంది స్వచ్ఛమైన తెలుగులో.

సమాధానం ఇవ్వడమా, మానడమా అని నేను తర్జనభర్జన చేసుకొంటూంటే ఆమె "ఇక్కడే ననుకొంటా" అంది.

"సరే అయితేను" అన్నట్టుగా చూశాను. ఏ వేళకీ బస్సు రాకపోవడంవల్ల నాకు చాలా చిరాకుగా వుంది. ఓమూల, "దీన్ని ఎలాగ ఒదిలించుకోవడం" అని బెంగ. నేను మాట్లాడకపోవడం చూసి, "మీ కీవూరు కొత్తా?" అంది. "అవ్వే" అన్నాను. ఆమె నామాట నమ్మనట్టుగా నవ్వింది. ఇంక 'మాట్లాడకపోతే ఎలాగనే, "మీదేవూరు?" అన్నాను. నవ్వింది. నాకు వళ్లు మండింది. "మీ ఆడవాళ్లకి రెండే ఆయుధాలు; ఏడుపు, నవ్వు" అందామా అనిపించింది. ఈ పరాయి స్త్రీ మీద కనికరంగాని కోపం గాని అనవసరమని ఊరుకొన్నాను. నా హృదయాన్ని గ్రహించి నట్లుగా, "ఏమిటి ఆలోచన" అని మళ్లీ నవ్వింది. ఆమె ఎప్పుడూ నవ్వే. అదే ఆయుధం, అదే అన్ని మాటలూను.

"బస్సు దొరక్కపోతే తెలుస్తుంది" అన్నాను కాస్త కటువుగా.

"అది నాకు అనుభవమే. మీకే కాస్త ఇబ్బంది" అని నవ్వింది. నా కోపానికి పట్ట పగ్గాలు లేవు. "నన్ను సులభంగా అందరి మొగాళ్ళకు మల్లేనే బుట్టలో వేసుకోవాలను కొంటోంది గాబోలు. ఈ పప్పులు మనదగ్గిర ఉడకవు" అని లోపల అనుకొన్నా. ఆమెకి లొంగకపోవడమే, పురుషత్వ చిహ్నం అనే విపరీతాలోచన కలిగింది.

"ఇంత రాత్రివేళ ఎక్కడనుంచి? భయం లేదూ?" అన్నాను జాలిపడుతున్నట్లు నటిస్తూ.

"మీరు?" అంది.

"నేనా? సినిమానుంచి" అన్నాను.

"నేను సినిమాకి" అంది వెంటనే.

ఆ సమాధానంతో 'మాటా, మంతీ'కి అడ్డు పడింది. మెల్లిమెల్లిగా వాన చినుకులు పడ్డం మొదలు అయింది. హోటలు మూసేశారు. అలాగే నిలబడ్డాం. ఎలక్ట్రిక్ దీపాలు మాత్రం మసకమసకగా కన్నీరుతో నిండిన స్త్రీ కంటి వెలుగులా ఉన్నాయి. నాకు వాన పెద్దదయితే ఎలాగ అనే దిగులు. వానలో ఇద్దరం తడవడం మా మధ్యవున్న దూరాన్ని పోగొట్టింది కాస్త.

"మీది తెలుగా?" అన్నాను.

"అవ్వని" అని నవ్వింది.

"హోటల్లో వాళ్లు నిన్నెరుగుదురా?" అన్నాను.

"ఎరగరుమరి! వాళ్ళదీవూరు కాదు. ఎక్కడి నుంచో వచ్చారు" అంది. ఆ వక్రోక్తి నన్ను ముగ్ధుడిని చేసింది. ఆమెమీద జాలి ఎక్కువ అయింది. గౌరవాన్ని కూడా కాస్త పెంచింది.

"ఏమన్నా చదువు వుందా?" అన్నాను.

"లేద"ని తల వూపింది.

"మరి నువ్వింత చక్కగా మాట్లాడుతున్నావే" అన్నాను.

"సహజంగా బతికే జంతువులకి మాటలు అక్కరలేదుగాని, మనుష్యులకి ఒద్దూ" అంది. ఈ మాటలతో ఆమె అసాధారణవ్యక్తి అనుకొన్నాను. గౌరవం ఇంకా హెచ్చింది. గౌరవం ఎక్కువ అయినకొద్దీ ఆమెమీద జాలికూడా ఎక్కువైంది. నా జాలి ఆమెకు అక్కరలేదేమో అని భయం. చివరికి ఉండబట్టలేక, "నువ్వెవరో చెప్పవూ," అన్నాను ప్రార్థిస్తున్నట్లుగా. వాన తగ్గింది. బస్సుజాడే లేదు. ఆమె నవ్వింది. "మీలా మా చరిత్ర తెలుసుకోవాలనుకొనే వాళ్ళవల్ల మాకు ఉపయోగం లేదు. ఏ ప్రశ్నలూ అడగని వాళ్ళే మాకు జీవనాధారం" అంది. ఆమె మాటలు నన్ను కలవరపెట్టడం మొదలు పెట్టినవి. ఆమెనేదో ఉద్ధరించి బాగుచెయ్యాలనే అభినివేశం ఏర్పడింది.

"ఎందుకంత కర్కశంగా మాట్లాడడం" అన్నాను.

ఆమె మళ్ళీ నవ్వింది. నాకు నిప్పులమీద నుంచున్నట్లుంది. 'విషయాన్ని మార్చాలని,

"విధవబస్సు. ఇంకా రాదేమిటో" అన్నాను.

"రాకపోదులెండి." అంది కొంచెం హేళనగా.

నాకు ఒళ్లుమండింది. ఏమిచూసుకొని ఆమెకంత ధీమా! జేబులో డబ్బులు లేకపోతే నేను ఒట్టి వాడినతోటకూర కాడనే! నేనేమిటి అందరూ అంతే! కాని ఆమెనుగురించి తెలుసుకోవాలి; అహంభావాన్ని చంపుకొని, "ఎన్నాళ్ళయింది ఈ వూరువచ్చి" అన్నాను. ఆమె నావైపు ఒక్కసారి పరీక్షగా చూసింది. నడివీధిలో నగ్నంగా చేసింది నన్ను ఆ చూపు. ఆ చూపు నన్ను పట్టిచూసింది. నాకు చీదర అనిపించింది. ఆ క్షణంలోనన్ను తా నెరుగున్న ఎందరి మొగాళ్ళతో ఏయే విధాలుగా పోల్చిచూసిందో నాకు సిగ్గేసింది.

ఇంతలోకి ఆమేమనుకుందోగాని నావైపు తిరిగి, "సరే వినండి. కాని నన్ను మార్చాలని ఏదో నాకోసం చెయ్యాలని అనుకోకండి. నాలాంటివాళ్లు లక్షలున్నారు. వాళ్ళందరి స్థితీ బాగుండాలంటే నేటి ఆర్థిక వ్యవస్థే మారాలి. తలవంకరగా ఉంటే తలపాగావంకరకాదూ!" నేనేదో అడ్డపడి చెప్పబోయాను. నా మాటలు ఇంకా నా నోట్లో ఉండగానే ఆమె అందుకొని, "మీలాంటివాళ్ళ నేవి అన్నీ నాకు తెలుసు. ఆ చిలుక పలుకులే మీవూ పలికి నాకు మీ మీద ఉన్న గౌరవం పోగొట్టుకోకండి. మీ వల్ల నాకేమీలాభం లేదని తెలిసింది. అంచేత, నా కథవిన్నా నాకూమీకూ మధ్యవున్న సంబంధానికి ఏ లోటూరాదు. లేకపోతే చెప్పేదాన్ని కాదు. సత్యం చెప్పాలంటారుగాని, ఎందరు దాన్ని భరించగలరు? జీవితంలో చాలవరకు సత్యం తెలియకపోతేనే మంచిదేమో!" ఆమె మాటల్ని నేను వినటంలేదని ఇట్టే గ్రహించింది. "బస్సు వస్తుందా?" అని దూరంగా నేను చూస్తున్న వైపే చూసింది. నా స్వార్థాన్ని ఆమె యిలా పట్టుకోడంవల్ల నాకు చిన్నతనం అనిపించింది. "అబ్బే. వింటున్నా, తరువాత" అని తొట్రుపాటుతో అన్నా. ఆమె మళ్ళీ నవ్వింది.

నవ్వి, "నాదగ్గర దాచకండి. నా కథ ఎప్పుడేనా వినొచ్చులెండి. నాలాంటి వాళ్ళని ఎవర్ని, ఎప్పుడు కలుసుకొన్నా ఒకటే కథ. మాదంతా అవిభక్త కుటుంబం! అదుగో బస్సు దీపాలు. అది ఆగీ ఆగడంతోనే ఎక్కండి. లేకపోతే చోటుండదు. ఇది ఆఖరి బస్సు. మీరింటికి వెళ్లాలి, పాపం" ఆమె మాటలు పూర్తి చెయ్యడానికిపూర్వమే బస్సు వచ్చేసింది. బస్సు దీపాల వెలుగు మా ఇద్దరిమీదా పడ్డం చూస్తే, బస్సులో వాళ్ళేమనుకొంటారో అని నాకు భయంవేసింది. ఎంత జయించాలన్నా పుట్టినప్పటినుండీ నూరిపోసిన మర్యాదలు ఏమవుతాయి?

"ఒక్కరికే ఎడంసార్" అన్నాడు కండక్టరు. ఆమె ఏమవుతుంది? "ఏదో విధంగా ఇద్దర్నీ ఎక్కించుకో" అన్నాను. "వీల్లేదు సార్," అన్నాడు దర్జాగా - ప్రభుత్వపరం ఆయ్యాయి బస్సులు, నష్టం చేస్తారు- అన్నట్టుగా. నేను తటపటాయించడం చూసి, ఆమె "మీరెక్కి వెళ్లండి నన్నుగురించి మీకు ఆలోచన వద్దు" అంది. నే నింకేం చెయ్యను! "సరే" అని బస్సు ఎక్కుతూ, జేబులోంచి పది రూపాయల నోటు తీసి ఆమె చేతిలో పెట్టి బస్సు లోపలికి పోయాను.

అవిడ దాన్ని బస్సులో కందిస్తూ "మాకూ వృత్తి గౌరవం ఉందండీ, ప్రతిఫలం యివ్వకుండా డబ్బు దానంగా తీసుకోం" అంది.

బస్సు బయలుదేరిన దప్పుడే, ఆ నోటు కండక్టరు అందుకొని నాకిచ్చాడు. ఈ వ్యవహారం అంతా బస్సులోవాళ్లు, కళ్లప్పగించి చూస్తున్నారు. నేను బిక్క చచ్చిపోయాను.

సీటులో కూర్చునే ముందు ఒక్కసారి వెనక్కి తిరిగి చూశా. ఆమె ఆ వీధి లాంతరుకింద నిలబడేవుంది. వెలుతురులో చిన్న నవ్వు ఆమె పెదవులమీద కనబడ్డట్టయింది. బస్సు మలుపు తిరిగింది.

అసలు ప్రేమే ఎరగని స్త్రీ వుంటే వుండవచ్చుగాని, ఒక్క ప్రేమగాథే వున్న స్త్రీ వుండడం కష్టం.